# అసలు రహస్యం

'కాళీపట్నం'

సుందరం కూతులు ఈ సిరుద్యోగపు దినాల్లో ఉద్యోగానికి రాజీనామా యివ్వడం తోడి గుమస్తాల్లో చాలామందికి సంతోషాన్ని కలిగించినా తోడనే ఆలోచనకుకూడా ప్రేరేపించింది.

సుందరానికి ఓ ఎం. ఎల్. ఏ గారితో పరిచయముందనీ, సిండియా కంపెనీలో ప్రయత్నిస్తున్నాడనీ ఓ దేశద్రోహి అన్నాడు. కాదు రైల్వేలో ఇంటర్వ్యూ వచ్చిందని మరో ప్రబుద్ధుడన్నాడు. ఏది నిజమైనా కాకపోయినా సుందరం డబ్బు చేస్తే రిజైనిచ్చి వుండడనేది రూఢైన విషయం.

'తోడిగుమస్తా చేసినదాన్ని గురించి ఊహాగానం చెయ్యడం ఏం ఖర్మం- అదేదో ముఖాముఖీనే తేల్చుకోరాదూ?' అంటారు వినేవాళ్లు. కాని అది అంతే. సుందరం నిజానికి తోడిగుమస్తాయే అయినా అతడికీ వాళ్ళకీ మధ్య పెద్ద అఖాతముంది.

సుందరానికి అందరూ పెద్ద పెద్ద, గొప్పగొప్ప చుట్టాలు. వాళ్ళ మేనమామలు ఒకాయన పోలీసు సూపర్నెంటు. ఇంకో ఆయన సబ్ కలక్టరు. పెత్తల్లి కొడుకు లాయరు. సుందరం ఇతరులతో సంచరించేటప్పుడూ మాట్లాడే టప్పుడూకూడా అచ్చా సూపర్నెంటు కలక్టర్ల మేనల్లుడూ, లాయరుగారి పినతల్లి కొడుకూలానే మాట్లాడేవాడు. ఎవళ్ళతోనైనా తన్ను తాను పరిచయం చేసుకొనే అప్పుడైనా ఫలానావారి మేనల్లుణ్ణనీ, ఫలానావారి పినతల్లి కొడుకునూ అనే చెప్పుకుంటాడు. వాళ్లుకూడా పాపం మొహమాట పడో ఏమో నువ్వెవరూ? ఏం చదువుకున్నావ్? ఏం చేస్తున్నావ్? అని అడగరు. ఒకవేళ అడిగినా అతడేదో చెప్పగల సమర్థుడే. అందుచేతే అతడికీ ఇంకొకళ్ల పేరు చెప్పుకోలేని ఆ గుమస్తాలకూ మధ్య అంత పెద్ద అఖాతం.

ఆవలవున్న ఆ నగరాన్నీ, ఈవలవున్న ఈకు గ్రామాలనూ కలుపుతూ ఒక బ్రిడ్జివుంది. అది వెంకట్రావ్. ఊడుముల్లో తలా, పాముల్లో తోకా పెట్టే రకం.

అతడే బయట పెట్టాడు.

ఒక విరామకాలపు అనిర్బంధిత సభలో ఈ విషయం వచ్చింది.

ఒకగుమస్తా చుట్టూ ఉన్న ఫైల్సునిండా తుప్పల్లుతుళ్లుతూవుంటే కాఫీ చల్లారపోసుకుంటున్నాడు. మరొకడు కాఫీ ఫ్లాస్కు ఎదురుగా గోడనున్న మేకున పెడుతున్నాడు. ఇంకొకడు వ్రాసుకునే టేబిల్ మీదే ఓ ప్రక్కనుంచి చెట్నీ ప్రవహిస్తుంటే ఇడ్లీ పొట్లాం విప్పుక తింటున్నాడు. టేబిల్ మీద కాలు పెట్టుక నిల్చున్నవాడు చుట్ట కాలుస్తున్నాడు. కుర్చీమీద కాలు పెట్టుక నిల్చున్నవాడు బీడీ పీలుస్తున్నాడు. కుర్చీకోటిపై సగం కూర్చున్నవాడు పోజిస్తూ సిగరెట్ కాలుస్తున్నాడు. అతడే వెంకట్రావు. అన్నాడు.

'సుందరం అసలు క్వాలిఫికేషన్ ఏమిటో తెలుసా?'

వెంటనే జవాబువచ్చింది.

'ఇంటర్ మీడియట్!'

'స్కూలు ఫైనలు పోయింది.'

చప్పున అందరి దృష్టి అటు తిరిగింది.

'కాదు! ఇంటర్ మీడియట్ అని అతడు స్వయంగా చెప్పేడు నాతో.'

'అలాటివాళ్ళు నీలాటివాళ్లతో అలాగే చెప్తారు.'

క్షణకాలం అందరూ ఊరుకున్నారు. చెల్లారావు టేబిల్ మీంచి కాలుదించి ఆరిపోయిన చుట్ట కటికీలోంచి బయటకు పారేస్తూ అన్నాడు మెల్లిగా-

'పోనిస్తురూ! వీడు ఒకనాడు నిజం చెప్పి ఏడికాడుకనకనా—ఈనాడు నిజం చెప్పాడనుకోడానికి?'

చెల్లారావు ఆశించినట్టు వెంకట్రావు ఇరిటేట్ అవలేదు. పైగా పోజుమారుస్తూ అన్నాడు.

'అంతే! నమ్మి చెడినవారూ లేరూ—నమ్మక చెడిపోతే పోయ్యారు.'

రాగం సశాస్త్రీయంగానే పూర్తయింది.

తర్వాత వెంకట్రావు నిజాయితీమీద కాస్త వాదోపవాదాలు జరిగాయి.

చివరకు వెంకట్రావు సెట్టిచేత బ్రతిమాలించుకొని బ్రతిమాలించుకొని ఆరంభించాడు—

'సుందరం ఎప్పుడుజాయనయ్యాడీ ఆఫీసులో?'

కాఫీపాయి అప్పుడే లోపలికి దిగిన ద్రవ పదార్థం అడుగునించి జ్ఞాపకాన్ని బయటకు లాగి సెలవిచ్చాడు.

'పందొమ్మిదివందల నలభై-ఆరూ-'

వెంకట్రావ్ మాట పూర్తికానీకండానే మరో ప్రశ్న విసిరాడు. అతడికీ తొందరగానే వుంది చెప్పిందాకా.

'అంతకుముందు నెలల్లో జరిగిన గొప్ప రాజకీయ సంఘటన ఏమిటి?'

ఎవరూ మాట్లాడలేదు. చెల్లారావు విసుక్కుంటూ అన్నాడు.

'ఆ మాత్రపు రాజకీయ జ్ఞానమే యేడిస్తే ఇదేం ఖర్మమోయ్?! నేనూ - మినిస్టర్ను కాకపోతే అదే పాయెను-ఎంత చచ్చుగా జూసుకున్నా ఓ విడో (సంధిపలుకులో వి. డి. వో. కు పట్టిన ఖర్మం) నైనా కాకపొయ్యేవాణ్ణా? నెలల్లా కమ్మగా ఆ మునసబుగారి వీధి గదిలో నిద్దరపోయి నెలా ఆయేసరికి పచ్చకాగితం మాత్రం చల్లగా జేబులో పెట్టుకోపోయేవాణ్ణా? ఈ వెధవాఫీసులో ఉదయం నుంచీ సాయంకాలందాకా బండ చాకిరీచేస్తూ, చివరకు చుట్టముక్కకికూడా నిన్నూ నిన్నూ...'

చెల్లారావుకి విసుగొచ్చి ఉపన్యాసం ఆరంభిస్తే యుగాలు గడిచినా ఉపన్యాసంమాత్రం ముగియదు. అందుచేతే వెంకట్రావ్ రెండుచేతులూ జోడించి బ్రతిమాలుతూ అన్నాడు.

'క్షమించు బాబూ! నేరకపోయి రాజకీయాలు ప్రశ్నించాను. ఊరుకో! నేనే చెప్పుకుంటా లే.' తర్వాత క్షణమాగి సీరియస్‌గా ఆరంభించాడు.

'కాంగ్రెస్ మంత్రివర్గం పాలన స్వీకరించింది. అంటే టంగుటూరి ప్రధాని అయ్యాడు. తర్వాత టంగుటూరి దిగిపోయిన వెంటనే మనవాడుకూడా రాజీనామా యిచ్చేస్తా నంటుండేవాడు. కాని ఎందుకైనా మంచిదంటూ పస్తాయిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఇకబాధలేదని ధైర్యంకలగగానే రిజైనిచ్చేశాడు.'

వెంకట్రావ్ ఇంతచెప్పినా విన్నవాళ్ళకు మాత్రం మొదట ఎంత తెలిసిందో ఇప్పుడూ అంతే తెలిసింది. పైగా కొన్ని అపోహాలకు కారణమయ్యింది. చెల్లారావు ముఖంలో మళ్ళా పొడసూపే విసువు గమనించగానే వెంకట్రావే వ్యాఖ్యానం ఆరంభించాడు.

'అర్రే! ఇది బోధపడలేదూ!? - సుందరం పంతులు ఒక ఇనాందార్. ప్రజాప్రభుత్వం వచ్చిందిరా - కూచుని తినే రోజులు పోయాయిరా-అని తెలిసిన నాడు ఒళ్లు వంచి ఉద్యోగం చెయ్యడానికి తయారయాడు. కాని టంగుటూరి తన ఘట్టంలో ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్న మార్గం గుర్తించిన తర్వాతనైతేనేం, దరిమిలా మనకేంద్ర ప్రభుత్వ వైఖరి తెలుసుకున్న తర్వాతనైతేనేం 'అమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకున్నాడు. మొన్న జమీందారీ బిల్లులోంచి యినాములు కేటాయించారని ప్రకటించగానే టింగు రంగామని ఉద్యోగానికి రాజీనామా పారేశాడు.'

వెంకట్రావు కథనంలో తర్కానికి నిలవని హంశాలు నాకు తెలుసు. కాని ఇటువంటివారితో తర్కించి లెంపలువేసుకొన్న సందర్భాలు చాలా వున్నవి. అందుచేతే నేను పెదవికదపలేదు.

కాగా వెంకట్రావు ఊహాగానమే అయినా అది సవ్యగానమయి వుండటానికి కూడా చాలా అవకాశాలున్నాయి.

ప్రభుత్వం కొంతమందిని ఏకారణంచేతనైతేనేం పనిచెయ్యనక్కరలేకండానే కూచొని తినండిరా అంటే ఉద్యోగాలుకోసరం పరుగెత్తడానికి వాళ్ళకేం ఒళ్లకొవ్వా?

నేనిలా అని పస్తాయించడం మంచిపనే అయినట్టుంది. నిన్నగాక మొన్న మళ్ళా లంచిటైములోనే వెంకట్రావు అన్నాడు.

'సుందరంపంతులు అగపడ్డాడు.'

మళ్ళా సెట్టిచేత బ్రతిమాలించుకొని—అసలు సంగతి, సెట్టి వెంకట్రావును బ్రతిమాలడం ఓ అమూల్యహాస్యసన్నివేశంగా ఆనందిస్తారు ఆ గుమాస్తాలందరూ. అందులో క్రొత్తదనం లేకపోయినా నిన్నటికీ ఇవాళిటికీ తు, చ లలో కూడా భేదంలేకపోయినా వాళ్లు అందులోనే

ఏదో ఆనందమనుభవిస్తారు — బ్రతిమాలించుకొని చెప్పాడు.

"...మాటల్లో 'పేపర్లలో ఈనాముల ప్రత్యేకింపు తాత్కాలికమే అన్నారు. చూశారా?' అన్నాను. దానికాయన యేమని జవాబిచ్చాడో తెలుసా! తాత్కాలికం అనేదానికి అర్థం చాలా విశాలమైనదట. ఏమైనా తనతరానికి బాధలేదట. ఏపదేళ్లనాడో ఈనాములు రద్దుచేసినా దానివల్ల లభించే కాంపెన్సేషన్ తన తరానికే కాక తన సంతానంకూడా కాళ్లమీద కాళ్ళు వేసుకు కూర్చుని తిన్నా సరిపోతుందిట' - ఇదీ వరస.

ఆకాడికీ అన్నాను - 'రేపు యెలక్షన్లలో ప్రజాప్రతినిధివర్గం మారుతుందేమో!'

దానికీ జవాబిచ్చాడు - 'ఏం మారినా అసెంబ్లీలో జొరబడేది యినాములు దున్నే రైతుకాదు. కనీసం జిరాయితీ రైతైనా కాదు. పొట్టకు కులాసాగా గడిచిపోగా ఇంకేం పనా అని ఆలోచించే బాపతే ఇందుకు తలపడతారు. అంటే మావాళ్లే నన్నమాట. మనలో మనమాట - చెప్పకేం- ఇనాందార్లు కొంతమంది ప్రత్యేకం ఇదే రాచకార్యం నెత్తిన పెట్టుకొని అవసరమైన బురఖాల్లో చతుర్విధోపాయాలనూ ఉపయోగించి ఇందులో జొరబడనున్నారు. ఏర్పాట్లు చురుగ్గానే సాగుతున్నాయి. అందుచేత మనకు నిశ్చింత!' ఇదీ అతను చెప్పిన దాని సారాంశం.

వెంకట్రావు ఆగిపోయాడు. తక్కిన వాళ్లు దానిమీద ఎవరికి తోచిన అభిప్రాయం వాళ్లు సెలవిచ్చారు.

నాకు మాత్రం నవ్వు వచ్చింది - సుందరం పంతులు మూర్ఖతకు. కాని మళ్ళా వెంటనే నేనే పొరపడుతున్నానేమో ననే సందేహం కలిగింది.

# సంఘస్వామ్యం - సర్వసమత్వం

"సామాన్యుడు"

ఆధ్యాత్మిక జీవనం విడిచిన బ్రాహ్మణులు, తమ హస్తగతమయిన పాండిత్యంతోనూ, చిరకాల పరిశ్రమతో పరిణతిపొందిన మేధస్సుతోనూ రాజకీయోద్యోగాల నన్నిటినీ ఆక్రమించుకున్నారు. యంత్రయుగం రాకముందు కులవృత్తులతో సుఖజీవనం చేస్తున్న యితర కులాలవారు అప్పట్లో యిది పరిగణించలేదు. క్రమంగా కులవృత్తులు కోలుపోయీ, ఆధ్యాత్మిక జీవితం విడిచిపెట్టిన బ్రాహ్మణ కులంమీద గౌరవం నశించీ, కర్మసిద్ధాంతంలో విశ్వాసం నశించీ, వైజ్ఞానిక యుగంతో, విదేశీ విద్యావిధానంతో తమకూ విద్యావకాశములు లభించడంతో, తమలో కలిగిన చైతన్యాన్ననుసరించీ, అల్పకులాలవాళ్లు అగ్రకులాలవాళ్లమీద తీవ్రమయిన తిరుగుబాటు సాగించారు. యంత్రయుగంలో బ్రాహ్మణుడు మెకానిక్కయినాడు. కోమటిప్రభుత్వోద్యోగంపొందేడు. ఇల్లా కులానికీ వృత్తికీ సంబంధంపూర్తిగాపోయింది. అయినా, వృత్తిమీదగాక, జన్మమీద ఆధారపడిన కులంమాత్రం నశించలేదు. అభిరుచిమీద వృత్తి ఆధారపడేటట్లు, వృత్తిమీద కులం ఆధారపడేటట్లు మనవాళ్లు ఏర్పాటుచేసివుంటే యీ ఘోరపరిస్థితి యేర్పడకుండా వుండును. కాని అల్లా చేయలేదు.

కులవృత్తులు నశించడంతో అందరికీ ప్రభుత్వోద్యోగాలు మాత్రమే జీవనోపాధిగా కనుపించినవి. అందులో అగ్రస్థానం వహించిన బ్రాహ్మణులు యితరులను ఆదిలో చేరనీయలేదు. వారికి దొరలు మద్దత్తు!

సాంఘికంగా విపరీతమయిన ఆధిక్యాన్ని ఆరోపించుకునీ; సామాన్య ప్రజకన్న తామధికులమని విర్రవీగీ; యితరులను అజ్ఞానంలోనూ మూఢవిశ్వాసంలోనూ ఉంచీ; విజ్ఞానానికీ, విద్యావివేకాలకీ, వేదాంతజ్ఞానానికీ వాళ్ళు అనర్హులని శాసించీ; ఆఖరికి కొన్నిచోట్ల తమ అనుభూతిలేనిదే భర్త భార్యనుకూడా స్వీకరించకూడదనే దాకాపోయీ బ్రాహ్మణులు బ్రాహ్మణేతరుల్లో తీవ్రమయిన తిరుగుబాటూ, ద్వేషమూ కలిగించారు.